# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-10-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం కానున్నారు.

**2.** అందరికీ ఆమోదయోగ్యమైన కౌలు చట్టాన్ని అమలు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**3.** ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి వెల్లడించారు.

**4.** తెలంగాణలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పొందేందుకు పౌరసరఫరాల శాఖ దరఖాస్తు విడుదల చేసినట్లు ప్రచారం అవుతున్న వార్తల్లో నిజం లేదని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

**5.** పట్టుచీరల ఉత్పత్తికి పేరుగాంచిన ధర్మవరంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కోరారు.

==========================

ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం కానున్నారు. సాయంత్రం పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీతో ఆ తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారని అధికారులు తెలిపారు. ఈ సమావేశాల్లో కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల నిర్మాణాలపై చర్చించే అవకాశముందని తెలిపారు. కాగా నిన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అమరావతి, పోలవరం నిధులు, రాష్ట్రంలో వివిధ రహదారుల అభివృద్ధి, రైల్వేజోన్ శంకుస్థాపన, వరద బాధితులను ఆదుకొనేందుకు కేంద్రం నుంచి సాయం తదితర అంశాలను చర్చించినట్లు అధికారులు తెలిపారు.

--------------------------

అందరికీ ఆమోదయోగ్యమైన కౌలు చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఈ చట్టంపై వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కౌలురైతుల చట్టంపై రైతులు, కౌలురైతులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు. వారికి ప్రాధాన్యత కల్పిస్తూ చట్టాన్ని రూపకల్పన చేశామని, దీనిపై అభిప్రాయ సేకరణ కోసం తొలి ప్రాంతీయ సదస్సు

గుంటూరులో నిర్వహించామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 35 సెకన్లు)

---

ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర రహదారుల నిర్వహణ, పునరావాసం- సవాళ్లు, ఉత్తమ పద్ధతులు' అంశంపై అమరావతిలో నిన్న నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యశాలలో వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల 71 కి.మీ రహదారులకు సంబంధించిన మరమ్మత్తులు చేపట్టేందుకు 290 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. సరికొత్త సాంకేతికతో రహదారులను నిర్మిచేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, పునరుద్ధరణ కోసం అస్సాం, గుజరాత్ రాష్ట్రాల్లో అధ్యయనం చేయడం జరిగిందని మంత్రి వివరించారు.

---

తెలంగాణలో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం వెంటనే 11 వేల 713 కోట్ల రుపాయల నిధులను కేటాయించాలని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాను ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర హోం శాఖ అమిత్‌షా ఆధ్వర్యంలో జరిగిన వామపక్ష తీవ్రవాద ప్రభావిత రాష్ట్రాల సదస్సులో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి-ఎస్‌డీఆర్ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు 416.80 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను విడుదల చేయాలని కోరారు.

---

తెలంగాణలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పొందేందుకు పౌరసరఫరాల శాఖ దరఖాస్తు విడుదల చేసినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న వార్తల్లో నిజం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. తెలుగులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు దరఖాస్తులు ఇప్పటివరకు రూపొందించలేదని, ఇందుకోసం ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడం లేదని స్పష్టం చేసింది. కొంత మంది దళారులు లబ్ధిదారులకు దరఖాస్తులు పంపిస్తున్నారనే విషయం పౌరసరఫరాల శాఖ దృష్టికి వచ్చిందని తెలిపింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటన విడుదల చేశారు. దళారులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

---

విజయనగరం వైభవాన్ని, సంస్కృతిని చాటి చెప్పేలా సిరిమానోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దీనిపై మా ఆకాశవాణి విజయనగరం జిల్లా ప్రతినిధి కె.యన్ రామకృష్ణ మరిన్ని వివరాలు అందిస్తారు.

వాయిస్ (36 సెకన్లు)

---

ప్రజాపాలనలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ లోని కొమురం భీమ్ భవన్ లో వెనుకబడిన తరగతుల

సంక్షేమ శాఖపై మంత్రి నిన్న విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గురుకుల పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

---------------------------

పట్టుచీరల ఉత్పత్తికి పేరుగాంచిన ధర్మవరంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో నిన్న సమావేశమై ఆ క్లస్టర్‌కు సంబంధించిన ప్రణాళికను అందించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పవర్‌లూమ్స్‌తో పోటీ నెలకొనడంతో ధర్మవరం సంప్రదాయ పట్టుచీరల తయారీ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చేనేత క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం 80% నిధులు సమకూరిస్తే, మిగిలిన 20% రాష్ట్ర ప్రభుత్వం కేటాయించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి వివరించారు. చేనేత కళాకారుల అభివృద్ధికి ఉద్దేశించిన ఈ ప్రాజెక్టును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలోని ప్రతీ ప్రాంతంలో ఆయుష్ ఔషధాలు అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక దుకాణాలను ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ– RARI అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్. బి. వెంకటేశ్వర్లు తెలిపారు. 100 రోజుల్లో ఆయుష్ మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలపై విజయవాడలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయ వైద్య విధానాలను అభివృద్ధి చేయడంలో భారత్ ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. వృద్ధుల కోసం 10 వేలకు పైగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్టు తెలిపారు.

---------------------------

సంస్కృతి, సాంప్రదాయలను వారస్వత సంపదగా భవిష్యత్ తరాలకు అందించాలని తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అమెరికా వాషింగ్టన్ డీసీలోని గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్, వాషింగ్టన్ డీసీ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా, బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ సంస్కృతితో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రపంచం నలుమూలల ప్రతిబింబిచేలా కార్యక్రమాలను నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు.

---------------------------

ఈ నెల 10వ తేదీన జరగనున్న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం రెండవ సంచిక ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మలయప్పస్వామి ఈ ఉదయం మోహినీ అవతారంలో దర్శనమివ్వనున్నారు. ఈరోజు రాత్రి బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టమైన గరుడ వాహన సేవ జరగనుంది. కాగా.. గత రాత్రి సర్వభూపాల వాహనంపై బకాసుర వధ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

=====================